దసరా, దీపావళికి 650 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : దసరా, దీపావళి నేపథ్యంలో తెలంగాణలోని సికింద్రాబాద్, హైదరాబాద్ డివిజనల్ రైల్వే తోపాటు ఏపీలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్ డివిజనల్ రైల్వే ఆధ్వర్యంలో 650 రైళ్ల ఏర్పాటు చేసినట్టు అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లు నవంబర్ చివరకు వరకు నడుస్తాయని పేర్కొన్నారు.

తిరుమలలో మళ్లీ చిరుత కలకలం

సీసీటీవీలో రికార్డయిన దృశ్యాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): తిరుమలలో చిరుత సంచారం మరోసారి కలకలం రేపింది. శ్రీవారిమెట్టు ప్రాంతంలోని కంట్రోల్ రూం వద్దకు రాత్రి చిరుత రావడంతో సెక్యూరిటీ సిబ్బంది భయంతో లోనికి వెళ్లి తాళాలు వేసుకున్నారు. వెంటనే అప్రమత్తమై అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు రోజులుగా రాత్రి 10 నుంచి ఉదయం 5గంటల సమయంలో చిరుత శ్రీవారి మెట్టు ప్రాంతంలో సంచరించినట్టు అటవీ అధికారులు గుర్తించారు.

విజయవాడకు ఈ-గరుడ బస్సులు

సోమవారం నుంచి అందుబాటులోకి

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ పటాన్‌చెరు-బీహెచ్ఈఎల్-రామచంద్రాపురం నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికులకు టీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. బీహెచ్ఈఎల్ డిపో నుంచి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ వెళ్లేందుకు రెండు ఈ-గరుడ బస్సులను సోమవారం నుంచి అందుబాటులోకి తీసుకు వస్తున్నామని టీజీఎస్ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఈ బస్సులు రామచంద్రాపురం, నిజాంపేట్ క్రాస్‌రోడ్స్, జేఎన్టీయూ రైతుబజార్, శిల్పారామం, సైబరాబాద్ కమిషనరేట్, టెలికంనగర్ మీదుగా ఓఆర్ఆర్ నుంచి విజయవాడ వెళ్తాయని తెలిపారు. ప్రతి రోజూ రాత్రి 9.30, 10.30 గంటలకు రామచంద్రాపురం నుంచి బయల్దేరుతాయన్నారు.

ప్రతి గుడిలో జమ్మిచెట్టు నాటాలి

చిలుకూరు, స్కందగిరి ఆలయాల్లో మొక్కలు నాటిన పండితులు

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): ప్రతి గుడి ఆవరణలో జమ్మి చెట్టును నాటాలని చిలుకూరు బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్, స్కంద సుబ్రహ్మణ్య స్వామి దేవాలయ పండితులు కోరారు. గ్రీన్‌ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ ప్రారంభించిన 'గుడి గుడికో ఓ జమ్మి చెట్టు' కార్యక్రమంలో భాగంగా ఆదివారం సికింద్రాబాద్‌లోని స్కందగిరి సుబ్రహ్మణ్య స్వామి, చిలుకూరు బాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో జమ్మి చెట్టును నాటారు. కార్యక్రమంలో పవన్‌కుమార్, బీఆర్ఎస్ మొయినాబాద్ మండల జనరల్ సెక్రటరీ నర్సింహాగౌడ్, యూత్ వైస్ ప్రెసిడెంట్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

చిలుకూరు ఆలయ ఆవరణలో మొక్క నాటుతున్న ప్రధాన అర్చకుడు రంగరాజన్ తదితరులు

శ్రీవారి సేవలో సీజేఐ డీవై చంద్రచూడ్

సీజేఐ కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనం చేసిన అర్చకులు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్యచౌదరి స్వాగతం పలికారు. రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్ దంపతులకు అర్చకులు వేదాశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు స్వాగతం పలుకుతున్న టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి

'గాంధీ' కళాశాలకు విజయభారతి భౌతికకాయం

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 29: ప్రముఖ రచయిత్రి బోయి విజయభారతి (85) భౌతికకాయాన్ని ఆదివారం సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల అనాటమీ విభాగానికి అప్పగించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆమె అమీర్‌పేట్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో శనివారం కన్నుమూశారు. విజయభారతి మృతికి మాజీ సీఎం కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సాహిత్య, సామాజిక అధ్యయనశీలిగా ఆమె చేసిన కృషిని స్మరించుకున్నారు. విజయభారతి 1941లో తూర్పు గోదావరి జిల్లా రాజోలులో ప్రముఖ రచయిత, పద్మభూషణ్ దివంగత బోయి భీమన్న, నాగరత్నమ్మకు జన్మించారు. 1968లో మానవహక్కుల నేత, న్యాయవాది దివంగత బొజ్జా తారకంను వివాహం చేసుకున్నారు. ఆమె కుమారుడు రాహుల్ బొజ్జా ప్రస్తుతం తెలంగాణ ఐఏఎస్ కేడర్‌లో నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శిగా పని చేస్తున్నారు. విజయభారతి కోఠి ఉమెన్స్ కాలేజీలో పీజీ చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా పనిచేశారు.

రచయిత్రి బోయి విజయభారతి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఝాన్సీ, ప్రొఫెసర్ సుధారాణి, డాక్టర్ దయాఅరుణ తదితరులు

పలువురి నివాళి..

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మహబూబ్‌నగర్ కలెక్టర్ బోయి విజయేంద్ర, సీనియర్ ఐఏఎస్‌లు దాన కిశోర్, కొప్పుల రాజు, ఆఫీసర్స్ ఫోరం కన్వీనర్ సిద్ధోజీరావు, దళిత స్త్రీశక్తి కన్వీనర్ గెడ్డం ఝాన్సీ, పీవోడబ్ల్యూ సంధ్య, ప్రొఫెసర్ సుధారాణి, సీనియర్ జర్నలిస్ట్ బండారు రాజు, డాక్టర్ దయా అరుణ, టీపీసీసీ కార్యదర్శి దుర్గం భాస్కర్, డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు, ఏఐఎస్ఎఫ్ నేత స్టాలిన్, డాక్టర్ భూపెల్లి నారాయణతోపాటు అభ్యుదయవాదులు, దళిత సంఘాల నాయకులు, విజయభారతి పార్థివదేహానికి కుందన్‌బాగ్‌లోని రాహుల్ బొజ్జా నివాసంలో నివాళులర్పించారు.

ఈవో శ్యామలరావుతో సిట్ దర్యాప్తు బృందం భేటీ

తిరుమల లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంపై రెండోరోజు ఆదివారం సిట్ సభ్యులు తిరుపతి పోలీస్ అతిథిగృహంలో సమావేశమయ్యారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో టీటీడీ బోర్డు దగ్గర నుంచి అధికారులు, సిబ్బంది పాత్ర వరకు అన్ని అంశాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు. టీటీడీ ఈవో శ్యామలరావుతో సిట్ చీఫ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి 45 నిమిషాలపాటు చర్చించారు. ఏఆర్ డెయిరీకి సంబంధించి పూర్తి వివరాలను టీటీడీ నుంచి తీసుకున్నారు. మరో రెండు రోజులపాటు ఈ విచారణ కొనసాగుతుందని త్రిపాఠి వెల్లడించారు.

లడ్డూ కల్తీ దోషుల్ని శిక్షించాలి

సినీనటుడు సుమన్

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : తిరుమల లడ్డూ కల్తీ అంశంపై టాలీవుడ్ హీరో సుమన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లులో జరిగిన ఒక ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న సుమన్ ఈ వివాదంపై స్పందించారు. ప్రస్తుతం సిట్ విచారణ జరుగుతోందని, లడ్డూ కల్తీ నిజమని తేలితే దోషుల్ని శిక్షించాలని టీటీడీ ముందు డిమాండ్ పెట్టారు. తిరుమల దర్శనానికి వెళ్లే వారి డిక్లరేషన్ అంశం వ్యక్తిగతంగా ఆలోచించుకోవాలని సూచించారు. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించారని ఆరోపించారు.

బీసీ రిజర్వేషన్ అమలు చేసేదాకా పోరాడుతాం

- కుల గణన చేపట్టకపోతే మళ్లీ దీక్ష చేస్తా
- బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్ కుమార్ వెల్లడి

కరీంనగర్ విద్యానగర్, సెప్టెంబర్ 29 : కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి సభలో బీసీలకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా పోరాడుతామని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం కరీంనగర్‌లో పలు బీసీ సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీల అమలు విషయంలో ఎందుకు జాప్యం చేస్తున్నారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏటా రూ.20 వేల కోట్ల బడ్జెట్ విడుదల చేస్తామని చెప్పి ఎందుకు మోసం చేశారని ప్రశ్నించారు. గత నెల 25న హైదర్‌గూడలోని కేంద్ర కార్యాలయంలో ఆమరణ దీక్ష చేపట్టిన తర్వాత పోలీసులు అరెస్ట్ చేసి అనేక ఇబ్బందులు పెట్టారని తెలిపారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన తర్వాత ఆమరణ దీక్ష విరమించినట్టు చెప్పారు. దీక్ష విరమించి 20 రోజులు గడుస్తున్నదని, వెంటనే ప్రక్రియ చేపట్టకపోతే మళ్లీ ఆమరణ దీక్షకు సిద్ధమని హెచ్చరించారు.

భద్రాద్రిలో 4 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

భద్రాచలం, సెప్టెంబర్ 29 : భద్రాచల శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చే నెల 4 నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. తొమ్మిది రోజులపాటు రోజుకో అలంకారంలో శ్రీలక్ష్మీతాయారు అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 12న విజయదశమి సందర్భంగా భద్రాద్రి రామయ్యకు పట్టాభిషేకం, విజయోత్సవం, ఆయుధపూజ, శ్రీరామ లీలా మహోత్సవం నిర్వహిస్తారు. 17న శబరి స్మృతియాత్ర సైతం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆశ్వయుజ మాసంలో నిర్వహించే ఉత్సవాలకు సంబంధించిన నివేదికను ఆలయ ఈవో రమాదేవికి వైదిక బృందం అందజేశారు.

ఈడీ అదుపులో సాహితీ వెంచర్స్ లక్ష్మీనారాయణ

- ప్రీలాంచ్ పేరుతో 3వేల కోట్ల స్కామ్
- సీసీఎస్ పోలీసుల కేసుతో రంగంలోకి ఈడీ

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): సాహితీ ఇన్‌ఫ్రా టెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నది. ప్రీ లాంచ్ పేరిట ఈ సంస్థ రూ.3వేల కోట్ల స్కామ్‌కు పాల్పడినట్టు తెలిసింది. సీసీఎస్ పోలీసులు ఈ సంస్థపై ఇప్పటికే 50 కేసులు నమోదు చేయగా, తొమ్మిది ప్రాజెక్టుల పేరుతో బాధితుల నుంచి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేసిందని విచారణలో వెల్లడైనట్టు సమాచారం. దీంతో రంగంలోకి దిగిన ఈడీ.. లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నది. 2019-2022 మధ్య పలు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల పేరుతో ఈ సంస్థ పలువురి నుంచి రూ.వేల కోట్లు వసూలు చేసినట్టు తెలిసింది.

బెర్లిన్ మారథాన్‌లో ఐజీ రమేశ్

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): 50వ బెర్లిన్ మారథాన్‌లో హైదరాబాద్‌కు చెందిన ఐజీ రమేశ్ పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించిన మారథాన్‌లో 42.195 కిలోమీటర్ల (26.2 మైళ్లు) దూరం పరుగును 5 గంటలు 40 నిమిషాల్లో చేరుకున్నట్టు ఐజీ రమేశ్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు.

బజ్జీలు ఉద్దెర ఇవ్వలేదని..

ముఖంపై వేడి నూనె చల్లిన దుండగుడు • ఇద్దరికి తీవ్ర గాయాలు

కేటీదొడ్డి, సెప్టెంబర్ 29 : బజ్జీలు ఉద్దెర ఇవ్వలేదని కడాయిలో ఉన్న వేడివేడి వంట నూనెను ముఖంపై చల్లగా.. ఇద్దరు గాయపడిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం గువ్వలదిన్నెలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాసులు కథనం మేరకు.. గువ్వలదిన్నెకు చెందిన బొజ్జప్ప గౌడ్ బజ్జీల దుకాణం నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన వినోద్ మద్యం తాగి బజ్జీలు ఉద్దెర ఇవ్వాలని గొడవ చేశాడు. ఉద్దెర ఇవ్వనని బొజ్జప్పగౌడ్ చెప్పడంతో వినోద్ కడాయిలోని వేడి నూనెను బొజ్జప్ప గౌడ్‌పై చల్లాడు. బొజ్జప్పతోపాటు పక్కనే ఉన్న వీరేశ్ ముఖంపై నూనె పడగా తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం కర్నూల్ దవాఖానకు తరలించారు. వీరేశ్ భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు వినోద్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

మీ రిటైర్మెంట్ అనంతరం ఆనందకర జీవితాన్ని సొంతం చేసుకోవడానికున్న చక్కని ఆర్థిక సాధనాల్లో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) ఒకటి. అయితే ఇందులో తగిన యాన్యుటీ ప్లాన్‌ను ఎంచుకొనే బాధ్యత మాత్రం పెన్షనర్‌దే. ఎన్‌పీఎస్ 2024 హ్యాండ్‌బుక్ వివరాల ప్రకారం 2004 జనవరి 1న ఈ స్కీం ప్రారంభమైన దగ్గర్నుంచి పదవీ విరమణ సమయంలోనే 1,65,320 మంది యాన్యుటీ ప్లాన్లను ఎంచుకున్నట్టు తేలింది.

ఎన్‌పీఎస్‌లో సరైన ప్లాన్?

ప్రస్తుతం ఎన్‌పీఎస్ సబ్‌స్క్రైబర్ల కోసం 15 రకాల యాన్యుటీ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే ఎల్ఐసీ, ఎస్బీఐ లైఫ్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్, కొటక్ మహీంద్రా లైఫ్, మ్యాక్స్ లైఫ్, బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్, శ్రీరామ్ లైఫ్, టాటా ఏఐఏ లైఫ్, ఆదిత్యా బిర్లా సన్ లైఫ్ తదితర 15 జీవిత బీమా సంస్థలు యాన్యుటీ సర్వీస్ ప్రొవైడర్లుగా పనిచేస్తున్నాయి. యాన్యుటీ రేట్లు, ఆప్షన్సనుబట్టి ఈ ప్లాన్లు మారుతూ ఉంటాయి. ప్రస్తుతమున్న యాన్యుటీ ప్లాన్లలో ఐదు రకాలే పాపులర్. వాటిలో యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్, జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్.

ఎంచుకోండిలా..

యాన్యుటీ ఫర్ లైఫ్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే ఇది ఆగుతుంది. నామినీకి ప్లాన్ కొన్న ధరలో 100 శాతం తిరిగొస్తుంది.

జాయింట్ లైఫ్ యాన్యుటీ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్‌కు జీవితాంతం యాన్యుటీ వస్తుంది. ఒకవేళ చనిపోతే వారి భాగస్వామికి వస్తుంది. వీరూ చనిపోతే నామినీకి ప్లాన్ కొన్న ధర మొత్తం తిరిగొస్తుంది.

ఎన్‌పీఎస్-ఫ్యామిలీ ఇన్‌కమ్ ఆప్షన్ విత్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్‌కు, వారు చనిపోతే వారి భాగస్వామికి, వీరూ చనిపోతే సబ్‌స్క్రైబర్ మీద ఆధారపడ్డ తల్లిదండ్రులకు యాన్యుటీ చెల్లింపులు జరుగుతాయి. వీరి తదనంతరం సబ్‌స్క్రైబర్ పిల్లలు లేదా లీగల్ వారసులకు ప్లాన్ కొన్న ధరను మొత్తంగా చెల్లించడం జరుగుతుంది.

యాన్యుటీ ఫర్ లైఫ్ వితౌట్ రిటర్న్ ఆఫ్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్ జీవించి ఉన్నంత వరకే యాన్యుటీ వస్తుంది. చనిపోతే భాగస్వామికి, నామినీలకూ రాదు.

జాయింట్ లైఫ్ యాన్యుటీ వితౌట్ రిటర్న్ పర్చేజ్ ప్రైస్‌లో సబ్‌స్క్రైబర్, వారి భాగస్వామి జీవించి ఉన్నంతదాకా యాన్యుటీ వస్తుంది. వీరు చనిపోతే నామినీలకు ఏమీ రాదు. వీటన్నింటిలో మనకు ఏది ఉత్తమం అనుకుంటే దాన్ని ఎంచుకోవడం లాభదాయకం.

ఇవి గుర్తుంచుకోండి..

- **యాన్యుటీని కొనేముందు మన భవిష్యత్తు ఆర్థిక అవసరాలు ఏమిటన్నదానిపై అవగాహన ఉండాలి.**
- **అందుబాటులో ఉన్న యాన్యుటీ, పేఔట్ ఆప్షన్లు, నిబంధనలు, యాన్యుటీ కాంట్రాక్ట్ షరతులనూ తెలుసుకోవాలి.**
- **వయసు, కొనే ధరనుబట్టి యాన్యుటీ రేట్లు ఆధారపడి ఉంటాయి.**
- **నెల, త్రైమాసిక, అర్ధ వార్షిక, వార్షికవారీ చెల్లింపులను ఎంచుకోవచ్చు.**
- **పెన్షనర్ మరణానంతరం భాగస్వామికి కూడా పెన్షన్ వచ్చే ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ తక్కువగా వస్తుంది.**
- **కొన్న ధరను తిరిగి చెల్లించనక్కర్లేని ప్లాన్‌ను ఎంచుకుంటే పెన్షన్ ఎక్కువగా వస్తుంది.**
- **ఒక్కసారి యాన్యుటీ ఆప్షన్‌ను ఎంచుకొంటే ఇక మారదు. కాబట్టి ఎంచుకొనేటప్పుడే అన్నీ చూసుకొని నిర్ణయం తీసుకోవాలి.**

చిన్న పెట్టుబడి.. పెద్ద రాబడి

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో ఇన్వెస్ట్ చేస్తారా?

త్వరపడండి.. మరో 6 నెలలే సమయం

మీరు ఒక మహిళ అయితే, నమ్మకమైన రిటర్నులతో సురక్షిత పెట్టుబడిని కోరుకుంటున్నట్టైతే.. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)ను తీసుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000 నుంచి మొదలవుతుంది. వడ్డీరేటు కూడా 7.5 శాతంగా ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో అందుబాటులో ఉన్న చాలా ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీలు) లేదా పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్స్ (పీపీఎఫ్)లపై పొందే వడ్డీలకన్నా ఇది ఎక్కువే. అంతేగాక తమ ఆడబిడ్డల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు లేదా సంరక్షకులకున్న అత్యుత్తమ పెట్టుబడి సాధనంగానూ దీన్ని పేర్కొనవచ్చు. దీనికి రెండేండ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. దీంతో చదువు కోసం పొదుపు, చిరు వ్యాపారాల కోసం ప్రణాళికల వంటి స్వల్పకాలిక ఆర్థిక లక్ష్యాల సాధనకూ చక్కగా ఉపయోగపడుతుందనే చెప్పాలి.

ఏమిటి ఈ పథకం?

మహిళా సాధికారతే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళలు, ఆడపిల్లల అవసరాలకు పొదుపును ప్రోత్సహించడంలో భాగంగా 2023 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం ఈ స్కీంను ప్రారంభించింది. ఇందులో సురక్షిత, అధిక రాబడిగల పెట్టుబడులకు అవకాశాలుంటాయి. అయితే ఈ స్కీం పరిమితకాలమే అందుబాటులో ఉంటుంది. వచ్చే ఏడాది మార్చిదాకే లభిస్తుంది.

ప్రధాన ఫీచర్లు..

వార్షిక వడ్డీరేటు: 7.5 శాతం. ప్రతీ మూడు నెలలకోసారి లెక్కించి జమ చేస్తారు.

అర్హత: మహిళలు, ఆడపిల్లలకు మాత్రమే ఈ స్కీంలో పెట్టుబడికి వీలుంటుంది. మైనర్ల కోసం తల్లిదండ్రులు, వారి సంరక్షకులూ ఈ పథకాన్ని తీసుకోవచ్చు.

కాలపరిమితి: రెండేండ్లు. స్వల్పకాలిక లక్ష్యాలకు ఇది చక్కని సాధనం.

పెట్టుబడి: కనిష్ఠం రూ.1,000. గరిష్ఠం రూ.2 లక్షలు. ఒకేసారి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది.

ఏమిటి దీని ప్రత్యేకత?

- ఈ పథకంలో పెట్టుబడులపై ఏటా గరిష్ఠంగా 7.5 శాతం వడ్డీరేటును పొందవచ్చు. సేవింగ్స్ అకౌంట్స్, ఎఫ్‌డీలు, పీపీఎఫ్‌లతో పొందే వడ్డీరేటు కంటే ఇది ఎక్కువ. పీపీఎఫ్‌లో కూడా 7.1 శాతం వడ్డీరేటే వస్తున్నది. మహిళా సాధికారత దృష్ట్యానే ఈ స్కీంకు అన్నింటి కంటే ఎక్కువ వడ్డీరేటును ఆఫర్ చేస్తున్నారు.
- పెట్టుబడి మొదలైన ఏడాది తర్వాత అందులో 40 శాతం వరకు తిరిగి వెనక్కి తీసుకునే వెసులుబాటు ఈ పథకంలో ఉన్నది. అత్యవసర సమయాల్లో ఈ సొమ్మును వాడుకోవచ్చు. అలాగే ఇది కేంద్ర ప్రభుత్వ పథకం. కాబట్టి అత్యంత సురక్షితమైన పెట్టుబడిగా దీన్ని పేర్కొనవచ్చు. నిర్భయంగా మహిళలు తమ కష్టార్జితాన్ని ఇందులో మదుపు చేయవచ్చు.

ఎలా పెట్టుబడి పెట్టాలి?

పోస్టాఫీస్ లేదా ప్రభుత్వ రంగ బ్యాంకులో ఖాతా ద్వారా మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్‌లో పెట్టుబడులకు దిగవచ్చు. పోస్టాఫీసుల్లోనైతే దగ్గర్లోని పోస్టాఫీస్‌కు వెళ్లి అక్కడ దరఖాస్తు ఫారంను నింపాలి. మీ వ్యక్తిగత వివరాలు, పెట్టుబడి మొత్తంతోపాటు ఆధార్, పాన్, చిరునామా తదితర అవసరమైన ఇతర కేవైసీ డాక్యుమెంట్లను సమర్పించాలి. పెట్టుబడి మొత్తాన్ని నగదుగానైనా చెక్కు రూపంలోనైనా ఇవ్వవచ్చు. దీంతో ఎంఎస్ఎస్‌సీని అందుకోవచ్చు.

బ్యాంకుల్లోనైతే మీకు దగ్గర్లోని ప్రభుత్వ బ్యాంకుల శాఖలకు వెళ్లి అప్లికేషన్ ఫారాన్ని నింపి, కేవైసీ డాక్యుమెంట్ల జిరాక్స్‌లను సమర్పించాలి. నగదు, చెక్కు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. ప్రాసెసింగ్ అనంతరం సర్టిఫికెట్ మీ చేతికి వస్తుంది. కాగా, పెట్టుబడి పెట్టిన 6 నెలల తర్వాత మీ ఖాతాను మీరు ముగించవచ్చు. కానీ వడ్డీరేటు 5.5 శాతమే వర్తిస్తుంది. రూ.2 లక్షలు పెట్టుబడిగా పెడితే రెండేండ్ల తర్వాత రూ.2,32,044 వస్తుంది.

డిపాజిట్	వడ్డీ ఆదాయం	చివరకు వచ్చే మొత్తం
₹ 1,000	₹ 160	₹ 1,160
₹ 2,000	₹ 320	₹ 2,320
₹ 3,000	₹ 481	₹ 3,481
₹ 5,000	₹ 801	₹ 5,801
₹ 10,000	₹ 1,602	₹ 11,602
₹ 20,000	₹ 3,204	₹ 23,204
₹ 30,000	₹ 4,807	₹ 34,807
₹ 50,000	₹ 8,011	₹ 58,011
₹ 1,00,000	₹ 16,022	₹ 1,16,022
₹ 1,50,000	₹ 24,033	₹ 1,74,033
₹ 2,00,000	₹ 32,044	₹ 2,32,044

చదువు కోసం మదుపు..

నేడు పిల్లల విద్య కోసం చేస్తున్న ఖర్చుల భారం అంతా ఇంతా కాదు. తల్లిదండ్రులకు ఇదో పెద్ద సమస్యలా తయారైంది. అయితే సరైన ప్రణాళికతో పెట్టుబడులు పెడుతూపోతే దీన్ని అధిగమించవచ్చు. దీనికున్న అవకాశాలను పరిశీలిస్తే..

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లు

పిల్లల ఉన్నత విద్య వంటి దీర్ఘకాల లక్ష్యాల సాధనకు ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ చక్కని మార్గం. సిప్ ద్వారా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టే పెట్టుబడులు ఈక్విటీల్లోకి వెళ్తాయి. చిన్న మదుపరులకూ ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. అయితే ఈ పెట్టుబడులు మార్కెట్ ఒడిదొడుకులకు లోబడి ఉంటాయన్నది గుర్తుంచుకోవాలి.



ఎడ్యుకేషనల్ స్కీములు

వివిధ మ్యూచువల్ ఫండ్స్.. పిల్లల విద్యకయ్యే ఖర్చుల కోసం రకరకాల పథకాలను అమలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈక్విటీ, డెట్ లేదా బంగారంపై పెట్టుబడులు పెడుతూ ఆకర్షణీయ రాబడులను పొందవచ్చు.

ఫిక్స్‌డ్ డిపాజిట్లు

ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్లతో పోల్చితే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) తక్కువ రాబడులనే అందిస్తాయి. కానీ ఇవి సురక్షితమైనవి, నిర్దేశిత రాబడులనూ అందుకోవచ్చు.

విద్యా రుణాలు

ఉన్నత విద్య కోసం తల్లిదండ్రులు విద్యా రుణాలనూ తీసుకోవచ్చు. ఇతర రుణాలతో పోల్చితే వీటికి కొన్ని వెసులుబాట్లుంటాయి. మారటోరియం పీరియడ్ ఉంటుంది. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత రుణ చెల్లింపులను ప్రారంభించుకోవచ్చు. పాత పన్ను విధానం కింద ఐటీ చట్టంలోని సెక్షన్ 80ఈతో పన్ను మినహాయింపూ లభిస్తుంది.

ఆటుపోట్లకు ఆస్కారం!

దేశీయ స్టాక్ మార్కెట్లలో రికార్డ్ రన్ కొనసాగుతున్నది. మునుపెన్నడూలేని గరిష్ఠాల్లో సూచీలు కదలాడుతున్నాయి. ఇన్వెస్టర్లు పెట్టుబడుల దిశగానే పోతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో ఎక్కువ రోజులు ఈక్విటీ మార్కెట్లు లాభాల్లోనే నడిచాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీగానే ఎగిశాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,027.54 పాయింట్లు లేదా 1.21 శాతం పెరిగి 85,571.85 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 388 పాయింట్లు లేదా 1.50 శాతం పుంజుకొని 26,178.95 దగ్గర ముగిసింది. ఈ నేపథ్యంలో లాభాల స్వీకరణకు అవకాశాలు కనిపిస్తున్నాయి. శుక్రవారం మార్కెట్లు నష్టపోవడం ఇందుకు సంకేతంగా తీసుకోవచ్చని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఆల్‌టైమ్ హై దరిదాపుల్లో ఉండటం వల్ల సెల్లింగ్ ప్రెషర్ ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 25,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 25,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 26,400-26,600 మధ్యకు వెళ్లవచ్చు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.